క్లుప్తంగా

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు



మంగళగిరి టౌన్: ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతిని పురస్కరించుకుని మంగళగిరి పట్టణంలో బుధవారం శోభాయాత్ర, బైక్ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ ఆధ్వర్యంలో గౌతమ బుద్ధ రోడ్డులోని కాళికా మాత గుడి నుంచి బస్టాండ్ వద్ద అంబేడ్కర్ బొమ్మ సెంటర్ మీదుగా బంగ్లా వరకు చేరుకుని తిరిగి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం మిద్దె సెంటర్ మీదుగా సీతారామ కోవెల వరకు నిర్వహించారు. బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు తుల్లిమిల్లి రామకృష్ణ, పట్టణ అధ్యక్షుడు నాగేశ్వరరావు, నాయకులు పంచుమర్తి ప్రసాద్, మునగపాటి వెంకటేశ్వరరావు, ఛత్రపతి శివాజీ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని దీనాపూర్, మార్నింగ్ స్టార్ కళాశాలల్లో బుధవారం ఎమ్మెల్యే టి.శ్రావణ్‌కుమార్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు పట్టభద్రులు తమ ఓటు వేయాలని అభ్యర్థించారు. కొత్తపలి కోటేశ్వరరావు, నరసింహారావు, పి.లూర్దయ్య, విజయ్, వై.ప్రకాష్ పాల్గొన్నారు.

ఆలపాటికి మద్దతుగా ప్రచారం

దుగ్గిరాల: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపర్చిన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని చిలకలూరు పేట ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు మండలంలోని చింతలపూడి గ్రామంలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆలపాటిని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన అన్నారు. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఉన్నారు.

హిందీ భాషా పండుగ

దుగ్గిరాల: హిందీ భాషాపై విద్యార్థులు శ్రద్ధ చూపాలని ప్రధానోపాధ్యారాలు ఎస్ శోభాదేవి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో హిందీ భాషా పండుగను బుధవారం నిర్వహించారు. విద్యార్థులకు హిందీ ప్రాధాన్యతపై పోటీలు నిర్వహించడం జరిగింది. గెలుపు పొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులందరూ హిందీ భాష నేర్చుకోవాలని సూచించారు.

సురక్షిత ప్రసవాల కోసం కృషి

ఫిరంగిపురం: సురక్షిత ప్రసవాల కోసం ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని డీపీఎంఓ డాక్టర్ చుక్కా రత్నమన్ మోహన్ అన్నారు. ఫిరంగిపురం పీహెచ్‌సీని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ యాంటినేటర్, వ్యాక్సినేషన్ రిజిష్టర్లు, ఎంసీపీ కార్డులు పరిశీలించారు. రక్తం తక్కువగా ఉన్న గర్భిణులకు ఐరన్ సిక్రోజ్ ఇంజిక్షన్ చేస్తుండటాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి రోజు ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరిగి గర్భవతుల వివరాలు ఆర్సీహెచ్ పోర్టల్‌లో చేస్తారని తెలిపారు. అప్పటి నుంచి వారికి ప్రతి నెలా పరీక్షలు చేసి, మందులు (ఎఫ్‌పీసీ)లో అందజేస్తున్నట్లు చెప్పారు. బీపీ, షుగర్, థైరాయిడ్, గుండె సంబంధిత అనారోగ్యం ఉన్న గర్భిణులను హైరిస్కు కేసులుగా గుర్తించి, డాక్టర్ పర్యవేక్షణలో వారికి సుఖ ప్రసవం అయ్యేలా చూడాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 25వేల 772 మంది గర్భిణులు గుర్తించామని వారి పూర్తి వివరాలు నమోదు చేస్తామని చెప్పారు. మండలంలో ఇప్పటి వరకు 351మంది గర్భిణులను గుర్తించి, పరీక్షలు, మందులు అందిజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఏడాదిగా ఇప్పటి వరకు ఒక్క మాతాశిశు మరణాలు లేకుండా ఆరోగ్య సిబ్బంది పనిచేస్తున్నట్లు వెల్లడించారు. ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యురాలు శ్వేత, సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, ఎంఎల్‌హెచ్‌పీ అమృత, ఏఎన్ఎంలు సుశీల, కోటేశ్వరమ్మ, లావణ్య, ఆశ కార్యకర్తలు ఉన్నారు.



పరిశీలిస్తున్న డీపీఎంవో డాక్టర్ చుక్కా రత్నమన్ మోహన్

'కూటమి' కోటీశ్వరుల ప్రభుత్వం

కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్



మంగళగిరి టౌన్: కూటమి ప్రభుత్వం కోటీశ్వరుల ప్రభుత్వమని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ విమర్శించారు. మంగళగిరి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి, బ్యాంకుల రుణాలు, ప్రభుత్వ కాంట్రాక్టులు ఎస్సీ, ఎస్టీ ఓబీసీలకు వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం పేదలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సీఆర్డీఏ కాంట్రాక్టలన్నీ కోటీశ్వరులకే ఇస్తున్నారని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలను ఆర్థికంగా ఎదగనీయకుండా ప్రభుత్వం అడ్డుకుంటోందన్నారు.

కేఎల్‌యూలో ట్రిపుల్ ఈ కార్యశాల ప్రారంభం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ కార్యశాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రిపుల్ ఈ విభాగాధిపతి డాక్టర్ ఆర్‌బీఆర్ ప్రకాష్ మాట్లాడుతూ డీఎస్టీ, ఏఎస్ఆర్ఎఫ్, కేఎల్‌యూ సంయుక్తంగా ప్రాయోజిత అంతర్జాతీయ కార్యశాలను ప్రారంభించామని పేర్కొన్నారు. పవర్ ఎలక్ట్రానిక్స్ ఫర్ నెక్స్ట్ జనరేషన్స్ ఎనర్జీ అండ్ ఎలక్ట్రిక్ వెహికల్ సొల్యూషన్స్ ఛాలెంజెస్, హ్యాండ్ ఆన్ అప్లికేషన్స్ అనే అంశంపైన టెక్నికల్ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ కార్యశాలలో పునరుత్పాదక శక్తి మార్పిడి, ఎలక్ట్రిక్ వెహికల్ డ్రైవ్, చార్జింగ్ టెక్నాలజీ పైన వక్తలు పాల్గొని ప్రసంగించారు. ముఖ్య అతిథి సామ్రాజ్ సోలార్ ఇండస్ట్రీస్ సీఈఓ ఎ.అజయ్‌కుమార్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో దేశ ఇంధన అవసరాల కోసం సౌర శక్తి మార్పిడి డొమైన్‌లో వ్యవస్థాపకుల ఆవశ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో వి. శివనాగేశ్వరరావు, వర్శిటీ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ డాక్టర్ కె.రాజశేఖరరావు, ప్రో వీసీ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కేఆర్‌ఎస్ ప్రసాద్, ప్రిన్సిపల్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ డాక్టర్ టి.రామకృష్ణారావు, ట్రిపుల్ ఈ విభాగాధిపతి డాక్టర్ ఆర్‌బీఆర్ ప్రకాష్, కార్యశాల కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఇన్‌చార్జి వీసీ డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు

పురుగు ముందుల వినియోగంపై అవగాహన

మంగళగిరి: ప్రతి రైతు నాణ్యమైన విత్తనాలతో పాటు పచ్చి రొట్ట ఎరువులు వాడాలని, పంట సరళిలో పప్పు ధాన్యపు పంటలు ఉండేలా చూసుకోవాలని ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎస్.వెంకట లక్ష్మి తెలిపారు. నూతక్కి గ్రామంలో బుధవారం రాష్ట్రీయ కెమికల్, ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ పీఎం ప్రణామ్ కార్యక్రమంపై రైతులకు అవగాహన కల్పించారు. మార్కెటింగ్ మేనేజర్ రాజశేఖర్ జిల్లా ఇన్‌చార్జి విశాల్‌రావు పాల్గొని పొటాష్ ఎరువులు వాడకం గురించి తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లి రూరల్: మరమ్మతుల కారణంగా ఎంటీఎంసీ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ డీఈ సురేష్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గండాలయ్య పేట, కొత్తపేట, ఆర్అండ్‌బీ బంగ్లా, హాస్పిటల్ రోడ్, మెయిన్ బజార్, ఎయిమ్స్ గేట్, ఎకో పార్కు, నాంచారమ్మ చెరువు, తెనాలి రోడ్, పెదకోనేరు, హుస్సేన్ కట్ట, జీఆర్ స్కూల్, ఎన్‌సీసీ రోడ్, పాత మంగళగిరి ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ ఉండదని తెలిపారు.

దుకాణాలు తనిఖీ

మంగళగిరి టౌన్ : చిన్న పిల్లలను పనిలో పెట్టుకోవద్దని మంగళగిరి అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ మూర్తి హెచ్చరించారు. మంగళగిరి పరిధిలోని వివిధ ప్రాంతాల్లో బుధవారం షాపులను తనిఖీ చేశారు. షాపుల్లో పనిచేస్తున్న వారి వయస్సు నిర్ధారణకు ఆధార్ కార్డులను పరిశీలించారు. లేబర్ లైసెన్స్ ఉండాలని, 18 ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకోవద్దని వ్యాపారులకు సూచించారు.

శ్రీశైల క్షేత్రానికి 2 టన్నుల ఊరగాయ పచ్చళ్లు



మంగళగిరి టౌన్ : మహాశివరాత్రిని పురస్కరించుకుని శ్రీశైల క్షేత్రానికి రెండు టన్నుల 400 కిలోల ఊరగాయ పచ్చళ్లను పంపుతున్నట్లు విజయ పికిల్స్ అధినేత కాటూరి రాము, లక్ష్మి కుమారి దంపతులు తెలిపారు. మంగళగిరి నగర పరిధిలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం నుంచి శ్రీశైల మల్లికార్జునస్వామి అన్నదాన కేంద్రానికి బుధవారం ఊరగాయ పచ్చళ్లను ప్రత్యేక వాహనంలో పంపారు. ఈ సందర్భంగా కాటూరి రాము మాట్లాడుతు మహాశివరాత్రి సందర్భంగా సుమారు రూ.8.50 లక్షలు విలువచేసే ఐదు రకాల పచ్చళ్లను పంపుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాము దంపతులను పలువురు సత్కరించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లిరూరల్ : రాష్ట్ర మంత్రి నారా లోకేష్ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, కె.ఆదినారాయణ డిమాండ్ చేశారు. బుధవారం బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని సందర్శించి, మద్దతు తెలియజేశారు.

అన్ని కోణాల్లో చోరీ కేసు దర్యాప్తు

మంగళగిరి: బంగారం చోరీ కేసును అన్ని కోణాల్లో పటిష్టంగా దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకట్ తెలిపారు. చోరీ ఘటన అనుమానాస్పదంగా ఉందని, విజయవాడ నుంచి నాగరాజును ఎవరూ ఫాలో చేయలేదన్నారు. అసలు వ్యాపారులు ఐదు కేజీలు బంగారం తీసుకెళ్లడం అంతా అనుమానాస్పదంగా ఉందన్నారు. చోరీ జరిగిందా లేదా అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నామన్నారు. బుధవారం ఘటనా స్థలాన్ని అడిషనల్ ఎస్పీ పరిశీలించి, సీన్ కనస్ట్రక్షన్ చేసి, పలు సూచనలు చేశారని చెప్పారు.

యూపీహెచ్‌సీలో వరల్డ్ బ్యాంక్ బృందం



మంగళగిరి టౌన్: మంగళగిరి నగర పరిధిలోని ఇందిరా నగర్‌లో ఉన్న యూపీహెచ్‌సీని బుధవారం వరల్డ్ బ్యాంక్ బృందం సందర్శించింది. వరల్డ్ బ్యాంక్ కన్సల్టెంట్ గణేష్, మొహిర్ అహ్మదేవ్‌లు ఓపీ, ఈహెచ్ఆర్, నేషనల్ ప్రోగ్రామ్స్ అమలు, ఎన్కాస్ స్టాండర్డ్స్ గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. స్టేట్ క్వాలిటీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రమాదేవి యూపీహెచ్‌సీలకు భవిష్యత్తులో వరల్డ్ బ్యాంక్ కూడా సహాయం చేయాలని భావిస్తోందని తెలిపారు. యూపీహెచ్‌సీలో కెపాసిటీ బిల్డింగ్ తదితర అవసరాలను టీమ్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. స్టేట్ క్వాలిటీ కన్సల్టెంట్స్ డాక్టర్ నరేంద్ర, వాసు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.అనూష, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మణరావుకు మద్దతుగా ఎన్నికల ప్రచారం

తాడేపల్లిరూరల్: కృష్ణా, గుంటూరు పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు తరపున ప్రజా సంఘాల నాయకులు బుధవారం వడ్డేశ్వరంలో కరపత్రాలు పంపిణీ చేసి, ఓట్లు అభ్యర్థించారు. సీఐటీయూ నాయకుడు దొంతిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ నీతి, నిజాయితీ గల శాసనమండలి అభ్యర్థి లక్ష్మణరావు 2007 నుంచి ఉపాధ్యాయులు, ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై శాసన మండలిలో పోరాటం చేశారని గుర్తుచేశారు. ఆయనను గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి పల్లె కృష్ణ మాట్లాడుతూ ఈ నెల 27న జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కేవీపీఎస్ నాయకులు నాగపోగు విజయరాజు, కౌలు రైతు సంఘం నాయకులు గుడిసె శ్రీనివాసరావు, గుడిసె ప్రభుదాసు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

మంగళగిరి టౌన్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేఎస్ లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ పట్టణ పరిధిలో బుధవారం ప్రజా సంఘాల నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి విజయం చేకూర్చాలని విజ్ఞప్తి చేశారు. జేవీ రాఘవులు, పి.బాలకృష్ణ, వై.కమలాకర్ పాల్గొన్నారు.

విద్యార్థుల రక్తదానం



ఫిరంగిపురం: ప్రతి ఒక్కరూ సమాజ సేవలో ముందుండాలని ఇమ్మిగ్రూప్ ఆఫ్ ఇనిస్ట్యూషన్స్ చైర్మన్ డాక్టర్ ఇమ్మానియేల్ ప్రకాష్ అన్నారు. మండల కేంద్రంలోని ఇమ్మి నర్సింగ్ కళాశాలలో రక్తదాన శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇమ్మానియేల్ ప్రకాష్ మాట్లాడుతూ కళాశాలల వ్యవస్థాపకుడు డాక్టర్ పి.రంజన్‌బాబు వర్ధంతిని పురస్కరించుకొని రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 59 మంది విద్యార్థులు రక్తదానం చేశారని చెప్పారు. అనంతరం వీల్ చైర్లు, చేతి కర్రలు పంపిణీ చేశామన్నారు. కళాశాల డీన్ డాక్టర్ జాషువా ఐజాక్ ఇమ్మి, ఆర్నాల్డ్ జోవాధన్, ప్రిన్సిపల్ శ్రీమదన్, శిరీష, మాధవ్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

- మండల కేంద్రంలోని దీనాపూర్ క్యాంపస్‌లో కార్డ్స్ సంస్థ వ్యవస్థాపకుడు పి.రంజన్‌బాబు వర్ధంతిని పురస్కరించుకొని రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు విద్యార్థులు రక్తదానం చేశారు. రంజన్‌బాబు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సెయింట్ జేవియర్ కళాశాల ప్రిన్సిపల్ జీవన్ మణిబాబు, కార్డ్స్ సంస్థ డైరెక్టర్ కె.మేరి, రంజన్‌బాబు జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎండీ సుదర్శన్, సంస్థ జాయింట్ డైరెక్టర్ కె.పుష్పలత, సీజీసీ ప్రెసిడెంట్ ఆర్.అనిత, బాలబాట డిప్యూటీ డైరెక్టర్ యం.నాగేశ్వరరావు పాల్గొన్నారు.